గొర్రెల కాపరిపై మొసలి దాడి

- నదిలో గొర్రెలను దాటిస్తుండగా ఘటన

ఆత్మకూరు, జూన్ 21 : కృష్ణానదిలో గొర్రెల కాపరిపై మొసలి దాడిచేసిన ఘటన మండలంలోని మూలమల్ల శివారులో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు ఖానాపూర్‌కు చెందిన గొల్ల అంజన్న వృత్తిరీత్యా గొర్రెల కాపరి. మూలమల్ల శివార్లలో గొర్రెలను మేపుతూ రెండు గొర్రెలను కృష్ణానదిలోకి తీసకెళ్లి స్నానం చేయించాడు. అనంతరం ఆ రెండు గొర్రెలను నదిని దాటించి ఒడ్డుకు చేర్చుతుండగా ఒక్కసారిగా మొసలి దాడిచేసింది. గొర్రెలను అతికష్టంమీద ఒడ్డుకు చేర్చిన అంజన్న మొసలి దాడి నుంచి ధైర్యంగా తప్పించుకొని ఒడ్డుకు చేరాడు. ఈ దాడిలో అంజన్న కుడి కాలును మూడుసార్లు పట్టి లాగడంతో తొడభాగం వరకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన అంజన్నను చుట్టుపక్కల వారు గుర్తించి 108కు సమాచారమిచ్చారు. అక్కడి నుంచి ఆత్మకూరు సర్కారు దవాఖానకు తరలించిన అంజన్నకు వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు సిఫారస్సు చేశారు. ఇదిలా ఉండగా ఎలాంటిది ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు.

'టోల్‌గేట్'తో భూములు నష్టపోతున్నాం

- పనులను అడ్డగించిన అంచన్‌పల్లి రైతులు

గండీడ్, జూన్ 21: టోల్‌గేట్ ఏర్పాటు చేయడంతో తమ వ్యవసాయ భూములు నష్టపోతున్నట్లు అంచన్‌పల్లి గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ శుక్రవారం రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఎన్‌హెచ్-167 రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతుండడంతో పాటు గండీడ్ మండల పరిధిలోని అంచన్‌పల్లి గేట్ సమీపంలో టోల్‌గేట్ ఏర్పాటును రోడ్డు రవాణా శాఖ అధికారులు ఖరారు చేశారు. దీంతో శుక్రవారం టోల్‌గేట్ నిర్మాణం కోసం వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు పనులు మొదలుపెట్టారు. ఈ విషయం తెలియడంతో రైతులు అక్కడికి చేరుకుని, టోల్‌గేట్ పనుల వల్ల తమకు ఉన్న పొలాన్ని నష్టపోవాల్సివస్తోందని వాపోయారు. వెంటనే పనులు నిలిపివేయాలని జేసీబీపైకి ఎక్కి కూర్చుని ఆందోళన చేశారు.

కల్వర్టుపై నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల టౌన్, జూన్ 21: జడ్చర్ల పట్టణ శివారులోని బండమీదిపల్లి గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న కల్వర్టులో ప్రమాదవశాత్తు జారిపడి నాగరాజు(40) అనే వ్యక్తి మృతిచెందాడు. జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేటకు చెందిన నాగరాజు(40) ఈనెల 19న బుధవారం కూలీ పనికి వెళ్తున్నట్లు కుటుంబసభ్యులతో చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో మరుసటి రోజు నుంచి కుటుంబసభ్యులు గాలించారు. కాగా బండమీదిపల్లి శివారులోని రోడ్డుపక్కన కల్వర్టు వద్ద నాగరాజు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారిద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

దొంగల బీభత్సం

- వర్కూర్‌లో 9 తులాల బంగారం చోరీ..
- కొల్పూర్‌లో గ్రామదేవత తాళిబొట్టు అపహరణ

మాగనూర్, జూన్ 21: మండలంలోని వర్కూర్, కొల్పూర్ గ్రామాల్లో శుక్రవారం దొంగల బీభత్సం సృష్టించారు. వర్కూర్ గ్రామస్తుల కథనం మేరకు.. బొజ్జమొల్ల సుజాత తన బంధువు చనిపోతే దినకార్యాల కోసం ఇంటికి తాళం వేసి వెళ్లింది. ఆమె ఇంట్లో ఎవరూ లేరని గ్రహించిన దుండగులు గురువారం అర్ధరాత్రి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోన 9 తులాల బంగారం, రూ. 10వేల దొంగిలించారు. అదేవిధంగా కొల్పూర్ లో గ్రామ దేవత గజలమ్మ ఆలయంలో అమ్మవారి బంగారు తాళిబొట్టును సైతం దొంగలు చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఎస్సై మహ్మద్ అబ్దుల్ ఖాదర్‌ను వివరణ కోరగా. రెండు గ్రామాల్లో చోరీ జరిగిన విషయం వాస్తవమేనని.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దాయాదుల భూ పంచాయితీ

- మాటామాటా పెరిగి ఇరువర్గాల దాడి
- సర్దిచెప్పేందుకు వెళ్లిన వ్యక్తిపై అటాక్
- పోలీసుల ఎదుటే ఇరు కుటుంబాల యుద్ధం
- పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు

ఇరువర్గాలు దాడులు చేసుకుంటున్న దృశ్యం

హన్వాడ, జూన్ 21 : ఎకరా భూమి కోసం అన్నాదమ్ముల కుటుంబాలు దాడులు చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్నదర్‌పల్లి సమీపంలో శుక్రవారం చోటుచేసుకున్నది. సాయంత్రం ఇరువర్గాలు దాడి చేసుకుని, ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కథనం మేరకు.. తిర్మల్‌కుచ్చతండాకు చెందిన రేక్యేనాయ క్, మాగ్యేనాయక్ అన్నాతమ్ముళ్లు. తండా శివారులో సర్వే నెంబర్ 95లో ఎకరా భూ మి కోసం ఈ రెండు కుటుంబాల మధ్య కొన్నేండ్లుగా వివాదం తలెత్తుతున్నది. ఈ క్రమంలో శుక్రవారం రేక్యేనాయక్ కొడుకులు రాము, లక్ష్మణ్ ఆ పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా, మాగ్యేనాయక్ కొడుకులు రవి, రమేశ్ అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. భూమి పంచాయితీ తెగకముం దే ఎందుకు దున్నుతున్నావని ట్రాక్టర్ డ్రైవర్‌తో గొడవ పెట్టుకున్నారు. అటువైపు వచ్చిన యాదయ్య అనే వ్యక్తి కల్పించుకుని ట్రాక్టర్ డ్రైవర్‌తో ఎందుకు గొడవ పడుతున్నావు అని ప్రశ్నించాడు. దీంతో మాటా మాటా పెరిగి మాగ్యేనాయక్ కుటుంబ సభ్యులు యాదయ్యపై దాడికి దిగారు. అక్కడే ఉన్న రేక్యేనాయక్ కుటుంబసభ్యులు యాదయ్యతో కలిసి మాగ్యేనాయక్ కుటుంబంపై మూకుమ్మడి దాడికి దిగారు. ఒకరినొకరు తోసుకుంటూ దాడులకు పాల్పడ్డారు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని నచ్చజెప్పినా వినలేదు. అనంతరం పీఎస్‌కు వెళ్లి పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఘటనపై విచారణ చేసిన తర్వాత కేసులు నమోదు చేస్తానని ఎస్సై తెలిపారు.

గద్వాలలో భారీ చోరీ

- 30 తులాల బంగారం, రూ.3.50 నగదు అపహరణ

గద్వాల అర్బన్, జూన్ 21 : ఇంటి తాళం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు భారీగా బంగారం, నగదు అపహరించుకుపోయిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. పట్టణ ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. జిల్లా కేంద్రంలోని వేదనగర్‌కు చెందిన వ్యాపారి వీరప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి ఏపీలోని నంద్యాలకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న దుండగులు గురువారం పట్టపగలే ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలోని 30 తులాల బంగారం, రూ.3.50 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఇంటి డోర్లు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు వీరప్రసాద్‌కు ఫోన్‌లో సమాచారమిచ్చారు. దీంతో శుక్రవారం ఉదయం వచ్చి చూడగా.. బీరువాలోని బంగారం, నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా చోరీ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి బాధితుడి ఇంటికెళ్లి ఆరా తీశారు. జిల్లా కేంద్రంలో మూడు నెలల్లోనే దాదాపు 200కుపైగా దొంగతనాలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు పోలీసులు ఉన్నారా..? సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా..? అని ప్రశ్నించారు.

వామ్మో ఇసుక డంప్‌లు

- కొత్తపల్లి మండలం నందిగామ శివారులో నిల్వ
- గ్రామానికి చెందిన ఓ అధికారి హస్తమున్నట్లు అనుమానం

మద్దూర్ (కొత్తపల్లి), జూన్ 21 : సామాన్యులకు ఇసుక కావాలంటే ఆన్‌లైన్ అనుమతి తీసుకొని నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి.. కానీ అధికారం చేతిలో ఉం టే మాత్రం రాత్రికి రాత్రే గుట్టలు గుట్టలు గా ఇసుకను డంప్ చేసుకో వచ్చనడానికి ఈ సంఘటన ఉదాహరణ. కొత్తపల్లి మం డలం నందిగామ గ్రామానికి చెందిన ఓ పోలీస్ అధికారి ఇంటి నిర్మాణం కోసం గ్రా మ శివారులోని వాగు నుంచి రెండ్రోజులు గా ఇసుకను తరలిస్తున్నాడు. ఇదంతా రా త్రి వేళల్లోనే గుట్టుచప్పుడు కాకుండా రవా ణా చేస్తూ తన పొలంలో సుమారు 60, నుంచి 70 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా డంప్ చేయించాడు. ఈ విషయం కాస్తా ఆ నోటా.. ఈనోటా.. చివరకు అధికారులకు తెలిసింది. 'వడ్డించే వాడు మనవాడైతే కడన కూర్చున్న ఒక్కటే'.. అన్న చందంగా కొందరు అధికారులు అండగా నిలిచినట్లు తెలుస్తోంది. దీంతో సదరు ఉద్యోగులు సైతం చేసేది లేక ఆన్‌లైన్ పేరుతో అందిస్తున్నామని చెప్పి అప్పటికప్పుడే 20 ట్రాక్టర్ల ఇసుకను శుక్రవారం సరఫరా చేశారు. మిగితా ఇసుక కూడా లబ్ధిదారులకు చేరుతుందా.. లేక రహస్యంగా సదరు అధికారికి చేరుతుందా అన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నది. అయినా అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కాగా ఎమ్మార్వో అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా.. స్థానికుల సమాచారం మేరకు నందిగామ శివారులోని 60 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సుమారు 20 ట్రాక్టర్ల ఇసుకను ఆన్‌లైన్‌లో చేరవేశాం. మిగితాది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి అందజేస్తాం. అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయ విందాల్

నాగర్‌కర్నూల్, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతపల్లిలో గిరిజన మహిళపై ఆకృత్యానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయ విందాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళను వివస్త్రను చేసి లైంగికంగా హింసించడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మహిళల తలరాతలు మారడం లేదని వాపోయారు. బాధిత మహిళకు ఆర్థికసాయం చేయడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంకా బాధిత కుటుంబీకులకు ఆధార్‌కార్డులు, సంక్షేమ పథకాలు అందించలేదంటే పరిపాలన ఏవిధంగా ఉందో అర్థమవుతుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆమె వెంట జనతా వికాస్ నాయకులు హరిథ్ రూడా, లంబాడా హక్కుల సంఘం నాయకులు బాలాజీపవార్, శంకర్, మాలమహానాడు రాష్ట్ర సెక్రటరీ యాదగిరి, లక్ష్మణస్వామి, కార్యదర్శి కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తులతో దాడి

మహబూబ్‌నగర్, జూన్ 21 : ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వారు కత్తులతో దాడి చేసిన ఘటన మహబూబ్‌నగర్ పట్టణంలో చోటు చేసుకున్నది. టూ టౌన్ పోలీసులు, బాధితుల కథనం మేరకు.. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ సమీపంలోని సుశృత ప్రజావైద్యశాల సమీపంలో ఉన్న పాన్ షాపు వద్దకు శుక్రవారం రాత్రి 10 గంటలకు అరబ్‌గల్లీకి చెందిన సోఫియాన్ బీన్ సయ్యద్ (35) వెళ్లాడు. ఆ సమయంలో వీరన్నపేటకు చెందిన యువకులు వచ్చి పాన్‌షాప్‌లో సిగరెట్ అడిగారు. పాత బకాయి ఉందని, డబ్బులు ఇవ్వాలని షాప్ యజమాని కోరాడు. దీంతో మాటామాట పెరిగి మమ్మల్నే డబ్బులు అడుగుతావా? అని అతడిపై దాడికి యత్నించారు. పక్కనే ఉన్న సయ్యద్ వారిని అడ్డుకొని వెళ్లిపోండని తోసేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన సదరు యువకులు తమ వద్ద ఉన్న కత్తులతో అతడిపై దాడి చేశారు. దీంతో చెయ్యి, వీపు భాగంలో కత్తి గాట్లు పడ్డాయి. స్థానికులు అక్కడికి రావడంతో వారు పరారయ్యారు. కాగా సయ్యదను ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు.

గుండె గుబిల్లు

- వినియోగదారుడికి 1,33,085 కరెంట్ బిల్లు

జడ్చర్ల, జూన్ 21 : నెలకు కరెంట్ బిల్లు తక్కువలో తక్కువ అయితే రూ.200 లే దా.. రూ.500 వస్తుంది.. కొంచెం ఎక్కువగా అంటే రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు ఉంటుంది. కానీ ఓ వినియోగదారుడికి ఏకంగా రూ.లక్షకుపైగా రావడంతో అ తడి గుండె గుబేల్ మన్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటు చేసుకున్నది. వివరాలు ఇలా.. జడ్చర్ల మండలం చౌటగడ్డతండాకు చెందిన లింగూనాయక్ (విద్యుత్ సర్వీస్ నెంబర్ జీ 00502029)కు కరెంట్ షాక్ తగిలింది. అతడి ఇంటికి రూ. 1,33,085 కరెంట్ బిల్లు రావడంతో అ వాక్కయ్యాడు. గత మార్చి నెల వరకు రూ.63,037 బిల్లు రాగా.. జూన్‌లో తీసిన కొత్తగా పెద్ద మొత్తంలో బిల్లు రావడంతో ఆందోళన చెందుతున్నాడు. మార్చి నెల బి ల్లు వచ్చాక విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయాడు. ఏడీఈతోపాటు ఎస్సీ కార్యాలయంలోనూ వినతిపత్రాలు అందించినట్లు తెలిపాడు. తండాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో తన విద్యుత్ మీటరు కూడా కాలిపోయిందని, చాలా రోజులు కరెంట్ సరఫరా లేకుండానే ఉన్నామని చెప్పాడు. త ర్వాత మే నెలలో కొత్త మీటర్ తీసుకొచ్చి బిగించారని, మరుసటి నెలలోనే ఇంత బి ల్లు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. శు క్రవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ని ర్వహించిన విద్యుత్ శాఖ సమీక్షలో ఈ విషయాన్ని నాయక్ విన్నవించగా.. సరిచేయాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించినట్లు సదరు వ్యక్తి తెలిపాడు.

జూన్‌లో రూ.1,33,085గా వచ్చిన కరెంట్ బిల్లు

కొడవలి, కర్రలతో..

ఉండవెల్లి జూన్ 21 : ఒకరిపై ఒకరు కొడవలి, కర్రలతో దాడి చేసుకుని తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. మారమునగాల-2 గ్రామానికి చెందిన నాగరాజు ట్రాక్టర్‌తో యాదగిరిరెడ్డి పొలంలో పనులు చేస్తున్నాడు. కాగా రాంభూపాల్‌రెడ్డి పొలంలో పని చేస్తున్న బోయ పరశురాముడు పాతకక్ష మనసులో పెట్టుకుని అతడితో గొడవకు దిగాడు. మాటామాట పెరిగి పరశురాముడు కొడవలితో, నాగరాజు కర్రతో దాడి చేసుకోగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పసిడి-వెండి జిగేల్

- ఒక్కరోజే రూ.810 పెరిగిన తులం బంగారం
- 1,500 ఎగిసిన కిలో వెండి రేటు

న్యూఢిల్లీ, జూన్ 21: బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ పుత్తడి రేటు రూ.810 పుంజుకొని రూ.73,250ని చేరింది. 22 క్యారెట్ ధర రూ.750 అందుకుని రూ.67,150గా నమోదైంది. వరుసగా 4 రోజులు స్థిరంగా లేదా పడిపోతూ వచ్చిన పసిడి విలువ.. గురువారం కూడా పెరిగిన విషయం తెలిసిందే. ఇక వెండి ధర మరో రూ.1,500 ఎగబాకింది. కిలో 94,000 పలుకుతున్నది. క్రితం రోజు కూడా రూ.1,500 ఎగిసిన సంగతి విదితమే. ఢిల్లీలోనూ 24 క్యారెట్ బంగారం రూ.73,350గా, కిలో వెండి రూ.93,700గా ఉన్నది. ఈ ఒక్కరోజే రూ.800, రూ.1,400 చొప్పున ఎగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే.. కొమెక్స్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర ఒకేసారి 28 డాలర్లు పెరిగి 2,360 డాలర్లు పలికింది. ఔన్సు వెండి 30.40 డాలర్లుగా ఉన్నది.

జీఎస్టీ స్లాబులు తగ్గాలి: జీటీఆర్ఐ

న్యూఢిల్లీ, జూన్ 21: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్లాబుల సంఖ్యను తగ్గించాలని గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) కేంద్ర ప్రభుత్వానికి, జీఎస్టీ మండలికి శుక్రవారం సూచించింది. శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ 53వ సమావేశం జరుగనున్నది. ఈ క్రమంలోనే జీఎస్టీ మినహాయింపు పరిమితిని రూ.1.5 కోట్ల వార్షిక టర్నోవర్‌దాకా ఉన్న అన్ని సంస్థలకు పెంచాలని కూడా జీటీఆర్ఐ కోరింది. ప్రస్తుతం ఇది రూ.40 లక్షలుగానే ఉన్నది. పరిమితిని పెంచితే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు లబ్ధి చేకూరుతుందని, ఉద్యోగ-ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జీటీఆర్ఐ ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. ఇక రాష్ట్రాలవారీ రిజిస్ట్రేషన్లను దూరం పెట్టాలన్నది. కాగా, శనివారం భేటీలో ఆన్‌లైన్ గేమింగ్‌పై పన్ను వేయడంతోపాటు, ఎరువులపై పన్నును తగ్గించాలన్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులపై చర్చ జరిగే వీలున్నది. ప్రస్తుతం ఎరువులపై 5 శాతం జీఎస్టీ పడుతున్నది. సల్ఫ్యూరిక్ యాసిడ్, అమ్మోనియా తదితర ముడి సరకులపై 18 శాతం వర్తిస్తున్నది. జీఎస్టీలో ఇప్పుడు 5, 12, 18, 28 శాతం స్లాబులున్న విషయం తెలిసిందే. మరోవైపు జీఎస్టీ రేటుపై హేతుబద్ధ కమిటీ ఏర్పాటైంది. బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి కన్వీనర్‌గా నియమితులయ్యారు.

యులిప్‌లు పెట్టుబడులు కావు

- బీమా రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ, జూన్ 21: యునిట్ లింక్డ్ బీమా ప్లాన్ల(యులిప్)ను పెట్టుబడి పథకాలుగా ప్రచారం చేయవద్దని బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ బీమా సంస్థలకు సూచించింది. యులిప్‌లను పెట్టుబడి పథకాలుగా బీమా సంస్థలు ఇటీవల కాలంలో ప్రచారం చేస్తున్నాయని, ఇది సరైనది కాదని శుక్రవారం జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. మార్కెట్-లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీలు సాంప్రదాయ ఎండోమెంట్ పాలసీల కంటే భిన్నంగా ఉన్నాయని, ఇవి రిస్కులను కలిగివుంటాయని బీమా సంస్థలు ప్రత్యేకంగా పేర్కొనాలని సూచించింది. అదేవిధంగా బోనస్‌తో కూడిన ఎండోమెంట్ పాలసీల బెనిఫిట్‌లో బోనస్‌లకు గ్యారెంటీ లేదని ముందుగానే చెప్పాలని సూచించింది. అన్ని ప్రకటనలు బీమా పాలసీకి, యాన్యుటీ ప్రొడక్ట్‌కు సంబంధించినవి మాత్రమే ప్రచారం చేయాలని పేర్కొంది.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.6,959.29 కోట్ల డివిడెండ్ చెక్‌ను అందజేస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఎస్బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా

ఆర్థిక అసమానతలు తగ్గవు!

రాయిటర్స్ పోల్‌లో 84 శాతం ఆర్థికవేత్తల అభిప్రాయమిదే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రానున్న ఐదేండ్లలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడమే తన లక్ష్యమని లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఊదరగొట్టారు. భారత్ మెరుగైన వృద్ధిరేటుతో దూసుకుపోతున్నదని కేంద్రప్రభుత్వ ఏజెన్సీలూ గతకొంతకాలంగా ప్రచారం చేస్తున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధి 8 శాతం వరకు ఉన్నట్టు కేంద్రం ప్రకటించింది. అయితే, ఎవరెన్ని చెప్పినప్పటికీ, దేశంలో ఆర్థిక అసమానతలు మాత్రం తగ్గే సూచనలు కనిపించడం లేదని ఆర్థిక నిపుణులు, మేధావులు తేల్చిచెప్తున్నారు. స్టాక్‌మార్కెట్ల సూచీలు, జీడీపీ వృద్ధిరేటును చూసి పేదలు, మధ్యతరగతి వర్గాలకు లాభం చేకూరుతుందని అనుకొంటే అది పొరపాటేనని చెబుతున్నారు. రానున్న ఐదేండ్ల మోదీ ప్రభుత్వ హయాంలో పేదలకు కొత్తగా ఒరగబోయేది ఏమీ ఉండబోదని స్పష్టం చేస్తున్నారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో.. ఇప్పటికీ 80 కోట్ల మందికి ఉచిత బియ్యం సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్' సంస్థ మే 15-జూన్ 18 మధ్య నిర్వహించిన పోల్‌లో వెల్లడైంది. పోల్‌లో పాల్గొన్న మొత్తం 51 మంది ఆర్థికవేత్తల్లో .. ఏకంగా 43 మంది రానున్న ఐదేండ్లలో మోదీ హయాంలో దేశంలో ఆర్థిక అసమానతలు తగ్గే అవకాశమే లేదని, పేదల కష్టాలు తీరబోవని తేల్చిచెప్పడం గమనార్హం.



మెజారిటీ తగ్గడానికి కారణం ఇదే

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ సీట్లు రాకపోవడానికి కారణాలను కూడా ఆర్థికవేత్తలు విశ్లేషించారు. దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలు, పెచ్చరిల్లిన నిరుద్యోగమే దీనికి కారణంగా వివరించారు. 2047లోగా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తానని ప్రధాని అంటున్నారని, అయితే, నైపుణ్యం కలిగిన మానవ వనరులను పెంచడం, నిరుద్యోగాన్ని రూపుమాపడం, సమ్మిళిత వృద్ధితోనే ఇది సాధ్యమౌతుందని ఆర్థిక నిపుణులు సూచించారు. దేశ ఆర్థిక ప్రగతికి నిరుద్యోగమే పెద్ద సమస్యగా మారిందని పోల్‌లో పాల్గొన్న 90 శాతం మంది అభిప్రాయపడ్డారు.

ధనికులు మరింత సంపన్నులుగా..

ప్రస్తుత ప్రభుత్వం తీసుకొస్తున్న విధానపరమైన నిర్ణయాలతో మధ్యతరగతి వర్గాల నడ్డివిరుగుతున్నది. ఉచితాల కోసం పేదలు ప్రభుత్వంపై పూర్తిగా ఆధారపడే దుస్థితి దాపురించింది. అయితే, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, చేయూతతో ధనికులు మరింత సంపన్నులుగా మారుతున్నారు.

- సాయిబాల్‌కర్, ప్రొఫెసర్, సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్ సైన్సెస్

బడ్జెట్‌లో రోబో ట్యాక్స్?

ప్రతిపాదనను పరిశీలిస్తున్న కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 21: రాబోయే బడ్జెట్‌లో కొత్తగా 'రోబో ట్యాక్స్'ను కేంద్ర ప్రభుత్వం తీసుకురానుందా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ మేరకు ప్రతిపాదన వచ్చినట్టు తెలుస్తుండగా, దీన్ని అమల్లోకి తెచ్చే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను వచ్చే నెల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నారు. దీంతో వృద్ధిరేటు, ఉద్యోగ కల్పన, ఆర్థిక విధానాలు, పెట్టుబడులు, రుణ భారం, ఆహార ద్రవ్యోల్బణం వంటి ప్రధానాంశాలపై ఆయా రంగాల పెద్దలతో, ఆర్థిక నిపుణులతో మంత్రి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే 'రోబో ట్యాక్స్' పరిశీలన తెరపైకి వచ్చింది.

ఏమిటిది?

కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావంతో ఇటీవలికాలంలో ఉద్యోగాలు పెద్ద ఎత్తున పోతున్నాయి. బడా కార్పొరేట్ సంస్థలన్నీ మానవ శక్తికి బదులుగా రోబో ఆధారిత శక్తిపై దృష్టి సారిస్తున్న ఫలితమే ఇదంతా. దీంతో ఏఐ కారణంగా కొలువుల్ని కోల్పోయినవారిలో నైపుణ్యం పెంచేందుకు, అందుకయ్యే ఖర్చులకు నిధుల సమీకరణ కోసం ఓ ఆర్థికవేత్త నుంచి వచ్చినదే ఈ 'రోబో ట్యాక్స్' ప్రతిపాదన. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేపర్‌కు అనుగుణంగానే దీన్ని ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. ఏఐ రాకతో లాభాలున్నా.. భారీగా ఉద్యోగాలు పోతాయని, చాలామందికి ఇది బాధాకరమని ఐఎంఎఫ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. అందుకే నైపుణ్యాభివృద్ధి, నిరుద్యోగ బీమా కవరేజీ, వేతన బీమాలతోపాటు ప్రస్తుత కార్పొరేట్ ట్యాక్స్ వ్యవస్థల్ని పునఃసమీక్షించాలని ఐఎంఎఫ్ ప్రపంచ దేశాలకు సలహా కూడా ఇచ్చింది. ఇక అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏఐతో పెద్ద ముప్పే పొంచి ఉన్నదని ఐఎంఎఫ్ తొలి డిప్యూటీ